ౘ వేదాంతభేరి ౘ

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 52 మార్చి 2019 సంచిక : 03

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

విషయ సూచిక

01. ప్రార్థన - 05

02. మూడు ఆకాశాలు -శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06

03. భగవంతుణ్ణి విశ్వసించు - శ్రీరామకృష్ణపరమహంస - 10

04. సద్గురు వాణి - సద్గురు మలయాళస్వాములవారు - 11

05. ముక్తి అనగా - భగవాన్ సత్యసాయిబాబా - 12

06. శ్రీమలయాళస్వామి జీవిత చరిత్ర-సంఘ సంస్కరణ - 15
- డా॥ సముద్రాల లక్ష్మణయ్య

07. ఉద్ధవగీత - వై.హెచ్.రామకృష్ణ -17

08. స్వార్థం - పరార్థం - డా॥ ఆచార్య కె.సర్వోత్తమరావు - 27

09. జీవుడా!మేలుకో!! - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 29

10. శ్రీ మదాంధ్ర మహాభాగవతం-ఆచార్య జక్కంపూడి మునిరత్నం - 31

11. మహాశివరాత్రి -పట్టిసీమ వీరన్న - డా॥ కె.బి.రాజేంద్రప్రసాద్ -36

12 వార్తలు - 42

ముఖచిత్రం - శ్రీశైల మల్లికార్జున శివలింగం

4-03-2019 మహాశివరాత్రి

18-03-2019 నృసింహ ద్వాదశి

20-03-2019 ఫాల్గుణ పూర్ణిమ - హోళికోత్సవము

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

బ్రహ్మమురారి సురార్చిత లింగం, నిర్మల భాసిత శోభిత లింగం
జన్మజదుఃఖ వినాశక లింగం, తత్ప్రణమామి సదాశివలింగమ్.

దేవముని ప్రవరార్చిత లింగం, కామదహన కరుణాకర లింగం
రావణదర్ప వినాశక లింగం,తత్ప్రణమామి సదాశివలింగమ్.

సర్వసుగంధ సులేపిత లింగం,బుద్ధివివర్ధన కారణ లింగం
సిద్ధసురాసుర వందిత లింగం, తత్ప్రణమామి సదాశివలింగమ్.

కనకమహామణి భూషిత లింగం,ఫణిపతివేష్టిత శోభిత లింగం
దక్షసుయజ్ఞ వినాశక లింగం, తత్ప్రణమామి సదాశివలింగమ్ .

కుంకుమచందన శోభిత లింగం, పంకజహార సుశోభిత లింగం
సంచితపాపవినాశక లింగం, తత్ప్రణమామి సదాశివలింగమ్.

దేవగణార్చిత సేవిత లింగం,భావైర్భక్తిభి రేవచ లింగం
దినకరకోటి ప్రభాసిత లింగం, తత్ప్రణమామి సదాశివలింగమ్.

అష్టదళోపరివేష్టితలింగం, సర్వసముద్భవ కారణ లింగం
అష్టదరిద్ర వినాశక లింగం, తత్ప్రణమామి సదాశివలింగమ్.

సురగురుసురవర పూజిత లింగం, సురవనపుష్ప సదార్చిత లింగం
పరమపదం పరమాత్మక లింగం, తత్ప్రణమామి సదాశివలింగమ్.

లింగాష్టకమిదం పుణ్యం యఃపఠేత్ శివసన్నిధౌ
శివలోక మవాప్నోతి శివేనసహమోదతే.



మూడు ఆకాశాలు

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

అధ్యాత్మ వాఙ్మయమందు మూడు ఆకాశములను గూర్చిన ప్రస్తావన తఱచు వచ్చుచుండును, భూతాకాశము, చిత్తాకాశము, చిదాకాశము అని వానిపేర్లు. పరమార్థ శాస్త్ర విచారణయందు సాధకుడు ఈ మూడిటిని గూర్చిన పరిచయము తప్పక కలిగియుండవలెను. కాబట్టి వీనిని గూర్చి ఒకింత విచారించుట అవసరము.

మొదటిది భూతాకాశము – పంచమహాభూతములైన పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము – అను ఈ ఐదింటిలో చివరిదియగు ఆకాశము అతిసూక్ష్మమైనది. పృథివికంటె జలము, జలముకంటె అగ్ని, అగ్నికంటె వాయువు, వాయువుకంటె ఆకాశము – ఇట్లు ఒక దానికంటె మఱియొకటి సూక్ష్మతరములై యున్నవి. మొదటి మూడును అనగా భూమి, జలము, అగ్ని జనులకు గోచరములగుచుండును. తక్కిన రెండు అనగా వాయువు ఆకాశము దృష్టికి గోచరముకాక అత్యంత సూక్ష్మములై యుండును. ఆకాశమునందు శబ్దము, వాయువునందు శబ్దస్పర్శములు, అగ్నియందు శబ్దస్పర్శరూపములు, జలమందు శబ్దస్పర్శరూప రసములు, పృథివియందు శబ్దస్పర్శరూపరస గంధములు – ఇమిడియున్నవి. ఈ భూతాకాశము అనంతమై తనయందు లక్షలకొలది సూర్య చంద్రాదులను, గ్రహ ఉపగ్రహాదులను కలిగి అగణిత ప్రాణికోట్లకు ఆలవాలమై, నిత్యము పరిణామశీలమై యొప్పుచున్నది. నేడు ఒక వస్తువునందున్న అణువులు కొద్దిసేపటికే మఱియొకరూపమున ప్రకాశించుచుండును.

దృష్టాంతమునకు, ఈనాడు ఒకని శరీరమందున్న అణువులు ఏడు సంవత్సరములకు పూర్తిగా మారిపోవ దేహము నూతన అణువులతో గూడియుండును, ఆ అణువులు ఇతరములైన ఏ పదార్థములందో ప్రవేశించి మరల అటనుండి మారుచుండును. ఈ స్థూల ప్రపంచమందు, అనగా ఈ భూతాకాశమందు స్థిరమై, అచంచలమైనట్టి వస్తువు ఒకటిన్ని లేదు. సముద్రమందు తరంగములు నిరంతరము చంచలములై, ఒక తరంగములోని బిందువులు కొంతసేపటికి మఱియొక తరంగములోనికి మారుచుండులాగున ఈ భౌతిక ప్రపంచవస్తువులందును అణువులు నిరంతరము మారిపోవుచుండును. ఈ విశాల బ్రహ్మాండమను మహాసముద్రమున మనుష్య శరీరము ఒక తరంగము, దేవతాశరీరము మఱియొక తరంగము, కోతి ఒక తరంగము, కుక్క ఒక తరంగము, పక్షి ఒక తరంగము, దోమ ఒక తరంగము,చీమ ఒక తరంగము, ఆయా జీవరాసులయొక్క భౌతిక శరీరములు దినదినము, క్షణక్షణము మారిపోవుచున్నవి. కాబట్టి భూతాకాశమంతయును, బ్రహ్మాండమునందలి పదార్థములన్నియును నిత్యము పరిణామమును పొందుచు సుడిగుండమునందలి జలమువలె అస్థిరములై, ఏకరూపములేకయుండుచున్నవి. అందు ఒకానొక పదార్థమే మానవుని ఈ భౌతిక దేహము.

చంచలమై, క్షణికమై, నశ్వరమై, పరిణామశీలమై, మృత్యుగ్రస్తమైన ఇట్టి పంచభూతాత్మక శరీరముపై, అహం భావము, మమత్వము కలిగియుండు మానవుని అజ్ఞానము ఎంత ప్రగాఢమైనదో యోచించుకొన వచ్చును. పైగా విశ్వవ్యాపకమైన ఈ అనంతాకాశములో ఏ మూలనో ఒకచోట నక్కియున్న ఒక చిన్న భూగోళములో, ఒక చిన్న దేశములో, ఒక చిన్న ప్రాంతములో, ఒక చిన్న గృహములో పరిచ్ఛిన్నమైయున్న ఒక చిన్న దేహముమాత్రమే తానని భావించి దానిపై అభిమానముగలిగి రాత్రింబగళ్లు దానినే ఆరాధించుచు విషయభోగములకు దానిని ధారబోయుచు జీవితమును వ్యర్థముగ గడిపివేయుట ఎంత శోచనీయమగు విషయమో ఆలోచించుకొనవలసి

యున్నది. కాబట్టి మానవుడు భూతాకాశ వికారమగు ఈ చిన్న జడదేహము తాను కాదని ఎంత శీఘ్రముగ గమనించిన అంత శ్రేయస్కరము.

ఇక రెండవది చిత్తాకాశము. ఇది భూతాకాశము కంటెను అతిసూక్ష్మమైనది. అతి వ్యాపకమైనది. కనుకనే భూతాకాశమును తనయందు గలిగియున్నది. సర్వజీవుల యొక్క చిత్తములన్నియుచేరి చిత్తాకాశమగును. అనంత చిత్తాకాశ సముద్రములో మానవుని చిత్తము (మనస్సు) ఒక తరంగము, దేవతచిత్తము ఒక తరంగము, జంతువు చిత్తము ఒక తరంగము. సంకల్పములు, (కామక్రోధాది) వికారములు, వాసనలు, సంస్కారములు మొదలైనవన్నియు చేరి చిత్తమనబడును. చిత్తాకాశమందు భూతాకాశము ఇమిడియుండును. కాని పరమార్థమున రెండును జడమైనవే యగును. అట్లే చిత్తమందు దేహము ఇమిడియుండును. కాని వాస్తవముగ చిత్త దేహములు రెండును చైతన్య రహితములేయగును. చిత్తము తనయందలి వాసనలను అనుసరించి పెక్కు దేహములను ధరించుచుండును. స్థూల దేహము మరణించినను సూక్ష్మదేహమగు చిత్తము మరణించదు, అది వాసనానుసారము మఱియొక దేహమును ధరించుచుండును. మలినవాసనలు,సంస్కారములు, ఉన్నంతవఱకు జీవునకు (చిత్తమునకు) ఈ దేహములు తప్పవు. పుట్టుట చచ్చుట తప్పదు. కాబట్టి ఆత్మవిచారణచేతను, భక్తిజ్ఞాన వైరాగ్యధ్యానాదుల చేతను చిత్తమును శుద్ధమొనర్చుకొని,నిర్వాసనాయుక్తముగ చేసికొనిననే జీవుడుచిత్తరహితుడై, అమనస్కుడై,జననమరణాది క్లేశరహితుడై మోక్షము నొందగలడు.

ఇక మూడవది చిదాకాశము. దీనినే ఆత్మయనియు, బ్రహ్మమనియు పేర్కొందురు. ఇది వాస్తవముగ ఆకాశము కాదు. కాని

అతిసూక్ష్మమైనది యగుటచే పోలికకు ఆకాశముతో ఉపమానముగ చెప్పిరి. అంతియేకాని ఆకాశమునకును దీనికిని సంబంధములేదు. భూతాకాశము, చిత్తాకాశము జడములైనవి. చిదాకాశమొకటియే చైతన్యవంతమైనది. చిదాకాశముయొక్క సన్నిధానముననే భూతాకాశ చిత్తాకాశములు రెండును ప్రకాశించుచున్నవి. (సూర్యుని సన్నిధానముచే చంద్రుడు ప్రకాశించునట్లు,) మఱియు భూతాకాశ, చిత్తాకాశములు రెండును రజ్జువునందు సర్పమువలెను, జాగ్రతునియందు స్వప్నమువలెను చిదాకాశమునందు కల్పితములై యున్నవి. చిదాకాశము నిత్యమైనది, శుద్ధమైనది, చిన్మయమైనది. పుట్టుక చావులేనిది, శాశ్వతమైనది. అది సత్, చిత్, ఆనందస్వరూపము. జీవుడు ప్రతిబింబము, చిదాకాశరూపమగు ఆత్మ బింబము. బింబము సత్యము, ప్రతిబింబము అసత్యము, జీవుడు బింబరూపమగు తన ఆత్మను (చిదాకాశమును) మఱచి ప్రతిబింబమగు దేహమే (భూతాకాశవికారము) తానని భావించుచు అనాదికాలమునుండి ఈ సంసారచక్రమున తగుల్కొని పరిభ్రమించుచు పలువిధ దేహాదులను ధరించుచు, పుట్టుచు, చచ్చును నానాయాతనలను అనుభవించుచు క్రుంగి కృశించుచున్నాడు.

ఇట్టి శోచనీయస్థితి జీవునకు తగదు. ఏనాటికైనను తాను చిదాకాశమగు ఆత్మయేకాని దేహాదులు కాదని దృఢముగ తెలిసికొని జీవుడు బంధమును తెగద్రుంచుకొనవలసియున్నాడు. కాలము స్వల్పము. అవకాశములు తక్కువ. ప్రతిబంధములు ఎక్కువ. ఇట్టి పరిస్థితులలో మహోన్నత మానవజన్మమును బడసి జీవుడు అట్టి సదవకాశమును లభింప చేసిన పరమాత్మకు జోహారులర్పించి జీవితమును కడతేర్చుకొను ఉపాయమును శీఘ్రముగ అన్వేషించవలెను. తాను చిదాకాశస్వరూపమగు ఆత్మయేకాని భూతాకాశస్వరూపమగు ఉపాధి (దేహాదులు) కాదని నిరంతరము స్మరణ చేయుచు, అట్టి ఆత్మనే నిరంతరము భావించుచు

మననము చేయుచు ఆత్మస్థితియందు నిలుకడకలిగి మహదానంద మనుభవించుటయే జీవితమును కడతేర్చుకొనుటకు ఏకైక మార్గము. అట్టి ఆనంతస్థితియే మోక్షము. కావున మోక్ష సంపాదనమునకై సర్వులును యత్నశీలురై మానవత్వమును సార్థకము చేసికొనవలెను.

భగవంతుణ్ణి విశ్వసించు

- శ్రీరామకృష్ణ పరమహంస

భగవంతునికి ముక్త్యార్నామా ఇవ్వుము. భగవంతునికి నీ సమస్త భారాన్ని మనస్ఫూర్తిగా సమర్పించి నిశ్చింతగా ఉండుము. ఆయన నీచేత ఏపని చేయిస్తాడో అదే చేయుము.

తల్లి పిల్లిపిల్లను పొయ్యిలో పడుకోబెడితే పొయ్యిలోనే పడుకుటుంది. ఇంటి యజమాని యొక్క పరుపుపై పడుకోబెడితే ఆ పరుపుపైనే పడుకొంటుంది. పిల్లి పిల్లకు తనతల్లిపై ఉన్న విశ్వాసం, శరణాగతిభావం మనకు భగవంతునిపై ఉంటే మనం నిశ్చింతగా ఉండవచ్చును.

భగవంతుణ్ణి విశ్వసించు, ఆయనను ఆశ్రయించు అప్పుడు నీకు ఏలాంటి చింతా ఉండదు.

సత్త్వగుణం కలవారు మనస్సులో, లేదా ఒక మూలన, లేదా అడవిలో ధ్యానం చేస్తారు. దోమతెరలోపల కూర్చొని కూడ ధ్యానం చేస్తారు. ఏకాంతం లేనిదే భగవచ్చింతన చేయజాలరు. కంసాలి బంగారును కరిగించి నగలను చేస్తాడు. ఆ సమయంలో చీటికి మాటికి పిలుస్తుంటే బంగారాన్ని ఎలా కరిగించగలడు? బియ్యాన్ని చెరుగుతున్నప్పుడు ఒంటరిగా కూర్చొని చెరగాలి. మధ్య మధ్యలో బియ్యాన్ని చేతిలోనికి తీసుకొని శుభ్రం అయినవా లేదా అది చూడాలి. ఆ సమయంలో ఎవరో ఒకరు పిలుస్తుంటే ఎలా? నిర్జన స్థలంలో రహస్యంగా నామజపం చేయగా చేయగా భగవత్కృప లభిస్తుంది. ఆ తర్వాత దర్శనం లభిస్తుంది.

సద్గురు వాణి

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

నాగరికత : మన పూర్వీకులు బాహ్య నాగరికత మాత్రముండి, ఆత్మ సంస్కరణ లేనిచో అట్టి వారిని సుందరమైన ఒక మృగమో, సౌందర్యముగల ఒక పక్షియో అనియే తలంచి యుండిరి.

నిజముగా హృదయముయొక్క పవిత్రమైన పరివర్తనమే నాగరికతా చిహ్నమగును. హృదయంలో కరుణ, విరక్తి, సత్యము, శాంతము, ధర్మము, దైవబుద్ధి లేని నాగరికత నిజముగ అనాగరికతయే యగును.

కొన్ని పుష్పములు ఎంతో సౌందర్యముగా నున్నవి. త్రాచుపాము యొక్క పడగ ఎంత శోభాయమానమై యున్నది. కొన్ని పుష్పములయొక్క సౌరభిమున్ను, చిత్ర విచిత్రములైన వర్ణములున్ను ఎంత మనోహరులుగ నున్నవి. ఇవి యన్నియు మనుష్యులకన్నా బాహ్యపరిష్కారము ఎక్కువ గల్గియున్నవి గదా! దీనివల్ల బాహాశుచిత్వము, గృహ శుభ్రత అవసరం లేదని అర్థం కాదు. అయితే యిదే నిజమైన నాగరికత లక్షణమని తలంచి వ్యామోహములో పడిపోయి చెడిపోరాదని మాత్రము తెలుపుట కొఱకు వ్రాయడమైనది.

పాత్రయొక్క వెలుపల మాత్రము శుద్ధపఱచి, లోపల కడుగనిచో దానిలో గల వంటకమెంట్లుండునో తెలుసుకొనవచ్చును. మన పూర్వీక ఋషులు, సన్న్యాసులు, యోగీశ్వరులు, బుద్ధదేవుడు మొదలైనవారికి ఎంతవరకు బాహ్యాడంబరము లుండెనో చరిత్రకారులు నిర్ణయింపగలరు. అట్టి వారి జీవితములను పరిశీలించిన నాగరికత యొక్క గురుత కనుగొనవచ్చును. **(ధర్మ సేతువు - నుండి)**



ముక్తి అనగా

- భగవాన్ సత్యసాయిబాబా

ముక్తి అనగా ......

ఈనాడు ప్రతి మానవుడు ముక్తి కావాలని ఆశిస్తున్నాడు. నిజమే, ముక్తి కావలసినదే! కానీ దేనికి కావాలి ముక్తి ? శరీరానికా? మనస్సుకా? బుద్ధికా? లేక ఇంద్రియాలకా? దేనికి ముక్తి కావాలో ఎవ్వరూ కనుక్కోవడం లేదు కాని అందరూ ముక్తి కావాలని ఆశిస్తున్నారు. నా ఉద్దేశ్యమేమనగా దేహానికీ ముక్తి కావాలి, మనస్సుకూ ముక్తి కావాలి, బుద్ధికీ ముక్తి కావాలి, ఇంద్రియాలకూ ముక్తి కావాలి. ముక్తి అనగా ఏమిటి? బాధలనుండి విముక్తి పొందడమే ముక్తి. ఇప్పుడు మీకు ఆకలి వేస్తున్నది. కనుక భోజనం చేసి ఈ బాధ నుండి విముక్తి పొందితే అదే ఈ దేహానికి ముక్తి. మీ ఇంద్రియాలున్నాయి. అవి ఇష్టమొచ్చినట్లు సంచరిస్తున్నాయి. వాటిని సక్రమమైన మార్గంలో పెట్టడం కూడా ఒక విధమైన ముక్తియే. మీ దేహసంబంధమైన రోగాలను నివారణ గావించుకోవడం కూడా ముక్తియే. అనగా బాధలనుండి విముక్తి పొందడమే ముక్తి. అయితే జీవితానికి ముక్తి అంటే ఏవిధంగా ఉండాలి? ఈ జీవితమనేది అనేక వాంఛలచేత, భ్రమలచేత, కష్టములచేత క్రుంగిపోతున్నది. వీటికంతటికీ మూలకారణం ఈ శరీరమే! ఈ శరీరాన్ని ధరించడంచేతనే ఈవిధమైన బాధలు సంభవిస్తున్నాయి. కనుక మళ్ళీ జన్మించకుండాపోతే మనకీ బాధలే ఉండవు కదా! కనుక నిజమైన ముక్తి కోరే వ్యక్తి "స్వామీ! ఈ జన్మ నెత్తినందుకు కదా నాకీ బాధలన్నీ

ప్రాప్తిస్తున్నాయి! ఈ జన్మనే లేకపోతే బాధలే ఉండవు. కనుక నాకు మళ్ళీ జన్మనే అక్కరలేదు. ఈజన్మను నీవు సార్థకం గావించు" అని ప్రార్థిస్తాడు. **జన్మ సార్థకమైతే అదే ముక్తి.**

మానసిక భ్రమలే రోగాలకు మూలం

ఈ కలియుగంనందు రోగాలకు ఏది మూల కారణమని ప్రశ్నిస్తే ఎవ్వరూ సరియైన జవాబు చెప్పలేకపోతున్నారు. ఈ దేహం వల్ల సంభవించే రోగాలకంటే మనస్సుద్వారా సంభవించే రోగాలే మూడువంతులు అధికంగా ఉంటున్నాయి. అన్నం అధికంగా తింటే అజీర్ణ రోగం రావచ్చును, తక్కువగా తింటే ఆకలి పుట్టవచ్చును. కాలు జారి క్రిందపడితే కాలు విరగవచ్చును. ఇవన్నీ దేహానికి సంబంధించినవి. మన అజాగ్రత్తచేత కల్పించుకొన్నవి. కానీ ఇవి గాకుండా అమితమైన మానసిక యోచనచేత అనేక రోగాలు సంభవిస్తున్నాయి. హార్టుజబ్బు, కిడ్నీజబ్బు మున్నగు పెద్దపెద్ద జబ్బులన్నీ మనస్సు వల్లనే కల్గుతున్నాయి. "ఈ కోరిక ఫలించలేదే, నాకీ సుఖము చిక్కలేదే. ఈ పని కాలేదే" అని ఈవిధంగా నిరంతరము యోచన చేసి చేసి అనేక రోగాలకు గురి అవుతున్నాడు మానవుడు. ఎందుకీ యోచన చేయాలి? ఎందుకనవసరంగా వర్రీ (చింత) చేయాలి. **What is the shape of worry? It is mentally created fear only.** దీనివల్లనే మానవునికి అనేక జబ్బులు ప్రాప్తిస్తున్నాయి. కన్నులకు రోగాలొస్తున్నాయి. చెవులకు రోగాలొస్తున్నాయి. నాలుకకు రోగాలొస్తున్నాయి. క్యాన్సర్ రోగాలొస్తున్నాయి. దీనికంతటికీ మూలకారణం మూడువంతులు మానసిక సంబంధమైన భ్రమలే. భ్రమలు పెరిగి పెరిగి రోగములుగా రూపొందుతున్నాయి. ఈ సత్యాన్ని మీరు గుర్తించాలంటే మీకు మీరే ప్రయత్నించి చూడవచ్చు. "నాకే జబ్బూ లేదు. నేను పుష్టిగా ఉన్నాను,

నేను ఆరోగ్యంగా ఉన్నాను" అని ధైర్యంగా మీరు జీవించండి, అన్ని విధాలుగా అభివృద్ధి అవుతారు. కానీ ఒక్క దినమేమైనా " నా పల్స్ చాల బలహీనంగా ఉన్నదే. సరిగా ఆడటం లేదే" అని అనుమానపడి పల్స్ పట్టుకొంటే నిజంగానే అది బలహీనంగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఇది శారీరక రోగమా? కాదు. మానిసక రోగమే! ఈ విధంగానే అనేక రోగాలను మనం మానసికంగా పెంచుకొంటున్నాము. ఈ దేహం వల్ల మనస్సు అనేక భ్రమలకు గురియౌతున్నది. కనుక " ఓ భగవంతుడా! నాకింక ఈ దేహమే అక్కరలేదు. పునరపి జననం పునరపి మరణం... ఈ రావడం, పోవడం నాకు వద్దు. ఒక్కసారి పోతే నేను తిరిగి రాకూడదు. అట్టి శాంతిని నాకు ప్రసాదించు" అని కోరాలి. కోరడమంటే ఏవిధంగా కోరాలి? కేవలం నోటితో అడిగితే సరిపోదు. దైవాన్ని ప్రేమించాలి. తనను ప్రేమిస్తే తానే కలుగజేసుకొని అన్నింటిలోను విజయాన్ని సాధింపజేస్తాడు.

పూజ్యశ్రీశ్రీశ్రీ స్వాములవారి ఆరాధనోత్సవాలు

2019వ సంవత్సరం ఏప్రిల్‌లో **18**వ తేది నుండి ఏప్రియల్ **22**వ తేది వరకు **5** రోజులు శ్రీ శుకబ్రహ్మాశ్రమ సంస్థాపకులు పరమ పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి **21**వ ఆరాధనోత్సవాలు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరుగును.

18-04-2019వ తేది శ్రీవారి ఆరాధన.

22-04-2019వ తేది శ్రీవారి జన్మదినోత్సవం జరుగును.

ఈ సందర్భంలో అనేకమంది మహాత్ముల ప్రవచనాలు ఉండును.

అందరికి ఆహ్వానము.

శ్రీ మలయాళస్వామి జీవిత విశేషాలు - 18

తిరుగన్నేరదు నాదు జిహ్వా

- డా॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

స్వామి 1926 నుండి సంవత్సరానికి ఒకసారి చొప్పున 1962 వరకూ 36 సనాతన వేదాంతజ్ఞానసభలను స్వయంగా నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్‌లో అందలి చివరి సభ జరిగింది.

1932లో జరిగిన మొవ్వసభకు తప్ప తక్కిన అన్నిసభలకూ శ్రీవారు హాజరయ్యారు. ప్రభుత్వానుమతి లేదన్న కారణ 'మొవ్వ' సభకు వెళ్ళలేదు.

1961లో పాహికాపురంలో సభ నిర్వహింపబడింది. ఈ సభకు తాము హాజరు కాగలమని స్వామి కార్యకర్తలకు ముందే చెప్పియుండినారు. కాని సభా సమయానికి స్వామి ఆరోగ్య పరిస్థితి దిగజారింది. విపత్కర పరిస్థితి ఏర్పడింది. వైద్యులు స్వామి సభకు పయనించడం వీలు పడదన్నారు.

అందుకు స్వామి "మేము వస్తామని మాట ఇచ్చాము. అందువల్ల పోక తప్పదు, సాధువులే మాట పాటించకుంటే ఇంకెవరు పాటిస్తారు?" అని వైద్యులకు నచ్చ జెప్పారు.

వైద్యాలయంనుండి ఆశ్రమం చేరేసరికి పరిస్థితి ఇంకా విషమించింది. శిష్యులు కన్నీరు కారుస్తూ స్వామిప్రయాణాన్ని ఆపాలను కున్నారు. ఆశ్రమానికి వచ్చిన సభా కార్యకర్తలు గూడా "స్వామీ! ఈ పరిస్థితిలో మీరు ప్రయాణం చేయవద్దు" అన్నారు.

స్వామి "సాధువులు సత్యపాలన చేయాలి. ప్రాణభీతిచే సత్యం పరిత్యజించరాదు. అలా చేస్తే లోకం మననుండి ఏమి గ్రహించగలదు? ప్రాణం పోయినా సభకు పోవలసినదే" అన్నారు.

ఒక శిష్యుడు ఆపత్సమయంలో అసత్యం దోషం కాదంటూ

వారి జాక్షులందు వైవాహికములందు
ప్రాణ విత్తమాన భంగమందు,
చకిత గోకులాగ్ర జన్మరక్షణమందు
బొంకవచ్చు నఘము బొందదధిప!

అన్న భాగవత పద్యాన్ని ఉట్టంకించాడు.

అందుకు స్వామి "తిరుగన్నేరదు నాకు జిహ్వ వినుమా! ధీవర్య! వేయేటికిన్?" అను భాగవత సూక్తి నుదాహరించి "మీరు చెప్పినది అసురధర్మం. అది దైవధర్మం కాదు. అది శుక్రనీతి. ప్రాణాపాయ సమయంలో కూడా ధర్మాన్నిపరిత్యజించకపోవడమే దైవధర్మం సుమా!" అని చెప్పారు.

"స్వాములవారు భాగవత పద్యం ఎప్పుడు కంఠస్థం చేసుకొని ఉండినారో" అని అది విన్నవారు ఆశ్చర్యానికి గురి అయ్యారు. చివరికి స్వామి ఆసభకు హాజరై తిరిగి వచ్చారు.

ఒక భక్తుడు "స్వామీ! మీ వద్ద ఏవో మంత్రాలున్నాయి. మీరు మలయాళ దేశీయులుకదా! ఆ మలయాళమంత్రాల ప్రభావం మీలో ఉన్నదా" అని అడిగాడు.

"ఔను మా వద్ద రెండు మంత్రాలున్నాయి. (1). ఒకరి చేయి క్రింద నా చేయి చాచకుండుట. (2). ముందుకిడిన కాలు వెనుకకు తీయకుండుట. మీరు కూడా వీటిని పాటిస్తే ప్రభావ సంపన్నులు కాగలరు" అని చెప్పారు.

మూలం: **ఉద్ధవ గీత** తెలుగురచన :

శ్రీ వ్యాసమహర్షి యేలేశ్వరపు హనుమరామకృష్ణ

(గత సంచిక తరువాయి)

ఇప్పుడు నీకు బద్ధుని లక్షణములు, ముక్తుని లక్షణములు వివరిస్తాను. విరుద్ధమైన బంధ మోక్షములు ఆత్మకు ఏవిధంగా ఆపాదితములో (Attributed features) చెప్పుచున్నాను విను !

జీవ - ఈశ్వర న్యాయం

ఒకానొక చోట ఒక మహావృక్షం వున్నది. దాని వ్రేళ్ళు నేలలో విస్తారంగా లోతుగా విస్తరించి వున్నాయి. ఆ వృక్షముయొక్క కొమ్మలు, ఆ కొమ్మల ఉపకొమ్మలు అతి వైశాల్యంగా ఆచోటును ఆక్రమించుకొని వున్నాయి. ఆ కొమ్మలకు ఆకులు ఫలములు పిందెలు అసంఖ్యాకంగా వ్రేలాడు చున్నాయి.

ఎక్కడి నుండో రెండు పక్షులు వచ్చి ఆ మహా వృక్షముపై వ్రాలాయి. ఒకటి పెద్దది. ఒకటి చిన్నది. కొద్దిసేపైన తరువాత - చిన్న పక్షి అక్కడి కొమ్మలపై వ్రాలింది. ఫలాలు తింటోంది. అటుఇటు చూస్తోంది. గంతులేస్తోంది. కిచకిచ శబ్దాలు చేస్తూ ఆకొమ్మ - ఈకొమ్మవైపుగా వ్రాలి అక్కడి ఆకులలో పూలలో తన దేహమును దాచుకుంటోంది. మరల ఎగురుతోంది. మరల మరల ఆ వృక్షముపై అనేక చోట్ల వ్రాలుతోంది. అవిశ్రాంతంగా కదులుతోంది. ఎన్నో ధ్యాసలు! ఎన్నో రుచులు! ఎన్నో వేదనలు, రోదనలు! ఆశిస్తోంది! నిరాశపడుతోంది! ఆవేశపడుతోంది! నవ్వుతోంది! దుఃఖిస్తోంది! పుల్లపళ్లు తింటోంది! బాధగా కూతలు పెడుతుంది! ఇంతలోనే తీయని పళ్ళకొరకు వెతకుతోంది. గర్విస్తోంది! భంగపడుతోంది!

అద్దాని అన్వేషణా- ఆవేదనా- ఆలోచనా -ఆకాంక్షా- ఆలింగనా వ్యవహారములకు అంతు ఉండుట లేదు. ఏది ఏమైతేనేం? అది పెద్దపక్షిని ఒకవైపు చూసుకుంటూనే వున్నది. పెద్ద పక్షిని ఏమరచటమూలేదు, వదలటమూ లేదు. కొమ్మలపై చంగ్ చంగ్ గంతులు ఆపటమూ లేదు!

ఇక పెద్ద పక్షియో! ఆ మహావృక్షానికి పైన గల ఒక ఏకాంత ప్రదేశంలో ప్రశాంతంగా ఆనందంగా సమగ్రమైన విజ్ఞతతో తనను తానే సంపూర్ణమైన అవగాహనతో ఆస్వాదిస్తూ చిద్విలాసంగా చూస్తోంది. ఒక తండ్రి పిల్లవాడితో తమ ఇంటికి దూరంగా గల ఒకానొక ఉద్యానవనంలోకి వచ్చాడు. ఆ పిల్లవాడు ఉద్యానవనంలో ఆటలు ఆడుకుంటూవుంటే, తండ్రి ఒకానొక వాత్సల్యతతో గమనిస్తూ తన అనుభూతితో తాను ఉంటాడు చూచావా? పిల్లవాడు నాన్నను చూచుకుంటూనే ఆటలలో మునిగి గంతులు వేస్తూ వుంటాడు కదా! అట్లా ఆ పెద్ద పక్షి చిన్న పక్షియొక్క వైనమంతా వాత్సల్యంగా గమనిస్తూనే తాను ప్రశాంత ముద్ర వహించివుంటోంది!. అప్రమేయమై మౌన -ఆనందముల ఆస్వాదన కొనసాగిస్తోంది. ఆటలాడుకునే పిల్లవాడి వైనం - తన వైనం తండ్రికి తెలుసుకదా! అట్లాగే పెద్ద పక్షికూడా చిన్న పక్షి తన ఆనంద కల్పిత భావనా రూపము- అని ఎరిగి తాను మాత్రం చిత్స్వరూప చమత్కారంగా వెలయుచున్నది.

ఈ దృష్టాంతం పరమాత్మ (పెద్ద పక్షి), జీవాత్మ (చిన్న పక్షి) పరంగా గమనించు. జీవాత్మ తనను తాను దృశ్యాంతర్గతమైన దేహిగా దర్శిస్తోంది. దేహము అనే పంజరంలో చిక్కుకున్న పక్షివలె ఎరుగుచున్నది. సంగతి-సందర్భము-సంఘటనల మధ్య పరిమిత విశేషంగా తనను

ఎరుగుచున్నది! కర్మలకు సంబంధించిన సత్ఫల- దుష్ఫలభోక్తగా స్వకీయంగా భావిస్తోంది. అనగా, సత్ఫల దుష్ఫలభోక్తగా తనను తాను ఎరుగుచున్నది. ఈ దేహమునకు ఇక్కడి జన్మ - జరా- మృత్యు సంఘటనలకు వేరుగా తనను తాను ఎరుగుట లేదు. తనేమిటో ఎట్టిదో ఎందుచేతనో తానే ఏమరుస్తోంది!

ఇక పరమాత్మయో? నిత్య జ్ఞానాశ్రయుడు. జీవుడు అనబడు దానికి కేవల ఆనందస్వరూప సాక్షి! జన్మలు-కర్మలు-గుణములు-దృశ్యములు- సందర్భము- సంబంధములు మొ॥ వాటిచే స్పృశించబడనివాడు.

జీవుడు అవిద్యచే జనించుటచేత నిత్యబద్ధుడు! పరమాత్మ విద్యామయుడై వుండటంచేత నిత్యముక్తుడు!

ప్రతి ఒక్క వ్యక్తి పరమాత్మ (నిత్యముక్తుడు) జీవాత్మ (నిత్య బద్ధుడు)- ఈ ఇరువురి ఏకస్థానవాన చమత్కారవే! (Everybody is a combination of mere silent al-powerful witness (+) worldly participant).. ఈ పాంచభౌతిక దేహమే ఆ మహావృక్షము. జీవాత్మ పరమాత్మల ఏకస్థాన - ఏకత్వపు చమత్కారం గమనించి సునిశ్చితుడైన వానిని **వివేకి అని, విద్వాంసుడు అని, జ్ఞాతజ్ఞేయుడు** అని శాస్త్రములు పిలుస్తున్నాయి. "పరమాత్మ మరెక్కడో ! జీవాత్మనగు నేనిక్కడ!" అని పరిమితావగాహనకు అనుబంధుడైన వానిని **అవిద్వాంసుడు** అని చెప్పుతారు. అనగా ప్రతి ఒక్కడు జీవాత్మగా నిత్యబద్ధుడు. పరమాత్మగా నిత్యముక్తుడు.

ఉద్ధవుడు: హేపరంజ్యోతి స్వరూపా! పరమాత్మా! జీవ బ్రహ్మైక్యానుభవుడగు విద్వాంసుడు దేహమును ధరించవలసిన అవసరం కలిగి వుంటాడా?

పాంచభౌతిక దేహం త్యజించినవాడై వుంటాడా?

శ్రీ కృష్ణపరమాత్మ:

శ్లో ॥ దేహస్థో ఽ పి న దేహస్థో విద్వాన్ స్వప్నాత్ యథోత్థితః

అదేహస్థో ఽపి దేహస్థః కుమతిః స్వప్నదృక్ యథా (అధ్యా 11,శ్లో 8)

మిత్రమా! **నటించువాడు- నాటకములోని** పాత్రల వలె పరమాత్మ జీవాత్మ ప్రతి దేహంలోను యదాతథంగా ప్రదర్శితులైవున్నారు. ఇది గమనించి ఆస్వాదించు విద్వాంసుడు సదా ముక్తపురుషుడై వుంటాడు. "నేను దేహ బద్ధుడను!...' అనే భ్రమ -బంధ భావాలచే పరిమితుడై వుండడు.

నిద్ర లేచినవాడు, "నేను నిద్ర సమయంలో (కలలో) కనిపించిన సంపద ఆపదలకు చెందినవాడను!" అని భ్రమిస్తాడా? లేదు కదా! స్వప్నంలో కనిపించిన సంపదకు యజమాని ఎవరు? స్వప్నాంతర్గతుడైన ద్రష్టయా? స్వప్న సాక్షియా? మరొకరెవరన్నానా? ఊహచే జనించి - ఊహచే లయించేదానికి యజమాని అనునదేమున్నది?

నిద్రలేచినవాడు స్వప్న దృశ్యాన్ని తన జ్ఞప్తిలో ఏ విధంగా చూస్తాడో... విద్వాంసుడు, (లేక) నిత్యవివేకి ఈ జాగృత్ దృశ్యాన్ని ఆ విధంగా వర్తమానంలోనే చూస్తూ ఆస్వాదిస్తాడు. దేహంలో ఉంటూనే దేహము నాది. అంతేగాని నేను దేహమునుగాను... అనునది గమనిస్తున్నాడు. "ఈ వాహనము నాది" అని చెప్పుచున్నాడు. "ఈ వాహనము నేను"-అనడు కదా! దేహము విషయం కూడా అంతే!

అవివేకియో? నిద్రలో అడవిలో చిక్కుకున్నట్లు కలవచ్చిందనుకో? ఆ స్వప్నద్రష్ట తన ఇంట్లో పరుపుపై బంధువులమధ్య వుండి నిద్రుస్తున్నప్పటికీ, నేను అడవిలో చిక్కుకున్నానే ! నా గతి ఏమిటి?

ఏ మృగమైనా వచ్చి నా వెనుక పడదు కదా!... అనే భయం పొందుతాడు చూచావా? ఆ విధంగా కుమతి అయినట్టి అవివేకి దృశ్యము ఉన్నప్పుడు – లేనప్పుడు కూడా దృశ్యజాడ్యమును అనుభూతిగా పొందుచూనే ఉంటాడు.

అనగా ..అవివేకి దేహం ఉన్నప్పుడు, దేహం లేనప్పుడు కూడా దృశ్యతాదాత్మ్యరూపమైన సంసారము అనబడేదానిని అనుభవిస్తూనే వుంటాడు. వివేకికి దేహం ఉన్నప్పటికీ అతని పట్ల సంసారము స్వప్న మాత్రమువలె మొదలే లేనిదై వుంటుంది. అందుచేత వివేకికి దేహము యొక్క రాకతో వచ్చేదేదీ లేదు. పోయేదేదీలేదు. అతని సందర్శనము (perception I Interpretation) సుఖ–దుఃఖాలకు అతీతమై వుంటుంది.

అవివేకికి దేహము యొక్క పోకతో బంధము పోయేదీకాదు. అన్ని సంబంధ –బాంధవ్యాల బీజములు అంతరమున కొనసాగిస్తూనే ఉంటాడు.

సుఖ దుఃఖాలు స్వమనోకల్పితాలు!. సంసారము అనునది ఉన్నది మనస్సులోనే! దేహములో కాదు. దృశ్యములో కాదు. జగత్తులో కాదు. ఆత్మయందు కాదు.

స్వస్వరూపాత్మతత్త్వము గురించి వేదాంగములు –విజ్ఞులు చెప్పుచున్న వాక్యములను వివేకముతో గ్రహించాలి సుమా ! అట్టి వివేకి–ఇంద్రియములను (అనగా ఈ భౌతిక శరీరమును), ఇంద్రియార్థములను (శబ్ద–స్పర్శ–రూప–రస–గంధములను), గుణములను (సత్వ–రజో–తమో త్రిగుణములను) గ్రహిస్తూ– ఉపయోగిస్తూ– పాల్గొనుచూ కూడా **ఇదంతా జగన్నాటకంలోని పాత్రకు సంబంధించినవే గాని, నాకు సంబంధించినవి కావు!..** అని గమనిస్తూనే

వుంటాడు. "నేను జీవుడుగా మారి పోయాను! గుణములు నన్ను ఆవరిస్తున్నాయి! ఈ శరీరం నాకు బంధము. ఇంద్రియ విషయాలు నన్ను పట్టుకొని పీడిస్తున్నాయి.... "ఇటువంటి ఆయా అల్ప భావనలకు చోటివ్వడు. "నేను వీటికి కర్తను! భోక్తను! ఇవి నాకు సంబంధించినవి! నేను వీటికి సంబంధించిన వాడను..." అనే పరిమిత దృష్టులను స్వస్వరూపముపై ఆపాదించుకోడు. నటుడు నవరసాలు ప్రదర్శిస్తూ – ఈ కోపం, ఈ ప్రేమ, ఈ ఇష్టం, ఈ అయిష్టం, ఈ ఆవేశం నేను ప్రదర్శిస్తున్నప్పటికీ, **ఇవన్నీ నేను నటిస్తున్న పాత్ర సంబంధమైనది! పాత్ర నాటకంలోనిది. నేను సర్వదా వీటితో ప్రమేయం లేని స్వరూపం కలవాడినే!–** అని తెలిసియే వుంటాడు కదా! అందుచేత వివేకి (లేక విజ్ఞుడు) ఇంద్రియార్ధ రూపమగు జగత్తు చేతగాని, ప్రకృతి రూపమగు గుణముల చేతగాని, సహ జీవులతో సందర్భానుచితంగా ఏర్పడు సంబంధ –అనుబంధ –బాంధవ్యముల చేతగాని ప్రమేయము పొందదు! వాటిని స్వీకరిస్తూనే, స్వీకరించనివాడై ఉంటాడు. అతనికి ఏదీ బంధముకాదు. ఇక క్రొత్తగా పొందవలసిన మోక్షమేమున్నది? "నేను పాత్రధారినై వుంటూనే.. త్రిగుణములకు సూత్రధారిని కదా!"అని ఎరిగి వుంటాడు.

ఇక అవివేకి విషయానికి వస్తే..!

దైవాధీనంగా జగత్ కల్పనలోని ఒకానొక అంతర్భాగంగా వచ్చిపోయే ఈ శరీరములను చూస్తున్నప్పుడు గాని, ఇక్కడి త్రిగుణ విన్యాసంచేత ఏర్పడుచున్న ఇష్ట–అయిష్ట, సానుకూల్య ప్రాతికూల్య, ప్రియ–అప్రియములను గమనిస్తున్నపుడుగాని, **దీనికి నేను కర్తను! దానికి వారు కర్త!...** అనే భ్రమాహంకారానికి చోటిస్తున్నాడు!. ఎప్పుడైతే కర్తృత్వము వహించుట–ఆపాదించటం ప్రారంభిస్తున్నాడో..అప్పుడు జగదను

భవములచే నిబద్ధుడు అగుచున్నాడు” కర్తా ఉ స్మి!.. అని భావించి బంధంకొని తెచ్చుకుంటున్నాడు. “నా ఉ హమ్ కర్తా! మమ మాయా కర్తా!” –అనే విజ్ఞతను ఏమరుస్తున్నాడు.

విద్వాంసుడు నిత్యానిత్య వివేకి, వైరాగ్యయుక్తుడు అయినవాడు పడుకున్నప్పుడు, కూర్చున్నపుడు, వ్యవహారాలలో ప్రవేశిస్తున్నప్పుడు, చూస్తున్నప్పుడు, స్పర్శిస్తున్నపుడు, వాసన చూస్తున్నప్పుడు, భుజిస్తున్నపుడు– వింటున్నప్పుడు –ఇటువంటి సర్వ సందర్భములలోనూ ఈ ఈ త్రిగుణ ప్రదర్శన సందర్భాలలోను **నేను బద్ధుడిని** – అనిభ్రమించడు. వాటిచే అతడు నిబద్ధుడు కాడు.

“ఈ శరీరములోని ఇంద్రియాలు ఇంద్రియార్థాలచే ప్రేరేపించబడి ప్రవర్తిస్తున్నాయి. వీటిచే నేను నిబద్ధుడును కాదు! పరిమితుడనుగాను!’ –అని గమనించుచున్నవాడై ఉంటున్నాడు.

సూర్యుడు ఆకాశంలో ప్రకాశిస్తున్నాడు. అట్టి సూర్య బింబం ఒక తటాక జలంలో ప్రతిబింబిస్తోంది.సూర్య బింబము తటాక జలంలో ప్రతిబింబిస్తోంది కాబట్టి... అది తటాకజలంచే బంధింపబడింది– అని అంటామా? ప్రతి బింబించినంత మాత్రంచేత సూర్యబింబం జలానికి సంబంధించినదని గాని, జలంలో సూర్యబింబం చిక్కుకున్నదని గాని ఎవ్వరూ అర్థం చేసుకోరు కదా!. గాలి అంతటా వీస్తూ వుంటుంది! అటువంటి గాలి దేహాలలోను, వస్తువులలోను,పాత్రలలోను (Eg. In four wheeler Tyres,Foot Balls etc..)చిక్కుకున్నదని ఎవ్వరమూ అనం కదా!. స్వప్నం గురించి ఎరుకగలవాడు **స్వప్నంలో నేను చిక్కుకున్నాను.. ఇప్పుడేమో, బయటకు వచ్చాను** అని అనుకోడు కదా!. అట్లాగే విద్వాంసుడు కూడా

– నేను దేహముచే నిబద్ధుడను. ఈ ఇంద్రియార్థములు –ఈ పరిస్థితులు –ఈ సంబంధ బాంధవ్యములు నన్ను నిబంధిస్తున్నాయి –అనే భ్రమను పొందడు.

నేను జీవుడుగా జగద్విషయాలలో ప్రతిబింబిస్తున్నాను. అయితే ఏం? **ఆకాశంలో సూర్యునివలె ఆత్మస్వరూపుడనై, అప్రమేయుడనై ఈ ఈ భావాభావములను వెలిగిస్తున్నాను.** – అని గమనించినవాడై వుంటాడు. (లేక) **ఆత్మ సూర్యుడనగు నేను ఈ మనో – దేహ – జగత్ తటాకాలలో ప్రతిబింబిస్తున్నాను. ఇంత మాత్రమే!...** – అని గ్రహించి వుంటున్నాడు.

ఒకడు అద్దంలో ముఖం చూచుకుంటూ, ఈ అద్దంలో నా ముఖం చిక్కుకున్నది – అని వాపోతాడా? పసిపిల్లవాడు అద్దం గురించి తెలియక అట్లా (Having no knowledge about a mirror) అనుకుంటాడేమో మరి!

ఒకడు నిదురలేచిన తరువాత స్వప్నదృశ్యం గురించి ఎట్లా అనుకుంటూ వుంటాడు? వివేకి వర్తమానంలోనే తన ఎదురుగా వున్న ఇంద్రియార్థ సమ్మేళనము – సంగతి, సందర్భముల మేళావంటి ఈ జగత్తును ఆ రీతిగా చూస్తు ఉంటాడు. జగత్తు నుండి, దేహము నుండి, తదితర దేహ సంబంధములనుండి సదా – సర్వదా నివృత్తుడై, అతీతుడై, దర్పణ స్వబింబదర్శనదృష్టి కలవాడై వుంటాడు. **విజ్ఞానియగు వివేకి** ఇంద్రియములను విషయములతో ప్రవర్తింపజేస్తూ... తాను సర్వదా అతీతమైన అప్రమేయత్వమును వహించియే ఉంటాడు. ఎవని సంకల్పమైతే ప్రాణ–ఇంద్రియ–మనో–దేహాదుల క్రియలతో తాదాత్మ్యము చెందకుండా వుంటుందో... అట్టివాడు దేహస్థుడై వుండి కూడా, గుణములకు అతీతుడు, వినిర్ముక్తుడు **(Ever - beyond and Ever - relieved)** అయి వుంటాడు.

ఎవ్వరైతే ఈ శరీరము ఒకరిచే అర్చించబడుచున్నప్పుడు, మరొకరిచే అవమానించబడుచున్నప్పుడు ఉభయ సందర్భములలో కూడా సంతోష-దుఃఖములచే స్పర్శించబడకుండా ఇదంతా 'యాదృచ్ఛికం (No Body as cause) అని గమనిస్తూ - సమదృష్టితో చూస్తూ వుంటాడో - అతడే బుధుడు ! ముక్త పురుషుడు!అట్టివాడు సాధువులను చూసి స్తుతించడు! అసాధువులను దూషించడు (లేక) నిందించడు. గుణదోషములకు వ్యధచెందడు! సద్గుణములను చూసి మురిసిపోడు!దేనినీ, ఎవ్వరినీ దూషించడు, ఆశ్చర్యపడిపోడు. అతడు జగత్తుకు ఆవల ఆత్మారాముడై, జగత్ వృత్తులకు పట్టుబడనివాడై వుంటాడు! ఒక జడునివలె ప్రపాపంచిక సత్ అసత్ విషయ పరంపరలలో చిక్కుకోడు, మాట్లాడడు, ధ్యానించడు. అన్నింటా ఆత్మనే ధ్యానిస్తూ వుంటాడు. జగత్ నాటకంలో నటిస్తూనే ప్రేక్షకుడిలాగా చూస్తూ ఉంటాడు.

ఉద్ధవుడు : స్వామీ! అంతటి అతీతత్త్వము, ఆత్మారామత్వము ఒనగూడాలంటే వేద-వేదాంగ పాండిత్య మవసరమంటారా? (లేక) వాటి అవస్యకత అనివార్యం కాదంటారా?

శ్రీకృష్ణుడు : ఓ ఉద్ధవా! ఆత్మయొక్క జగత్ ప్రదర్శనా చమత్కారము జగత్తు ఆత్మకు అద్వితీయము.. అను విశేషం ఎరుగక, నా ఆత్మయే జగత్ దృష్టిచే జగత్ రూపంగా కనిపిస్తోంది అని గమనించక. రోజులు గడుపుచున్నవానికి ఏ పాండిత్యమువలన ఏం లాభం? శబ్ద బ్రహ్మము (వేద మంత్రోచ్ఛారణము) నందు నిష్ణాతుడై కూడా ఆత్మతత్త్వముయొక్క అవగాహన యందు నిష్ణాతుడవకపోతే, అట్టి శాస్త్ర పాండిత్యము నిష్ఫలమైన శ్రమయే సుమా!.. పాలు ఈయని ఆవు, పతిపట్ల శ్రద్ధలేని భార్య, పరాధీనమైన దేహం దుష్టగుణములుగల కొడుకు, దానం చేయని

లోభియొక్క ధనము, అర్థంలేని వాక్ శబ్దాలు ఏ విధంగా వ్యర్థమో, అనేక దుఃఖములకు కారణమో,.అట్లానే ఆత్మజ్ఞానమును, ఆత్మతత్త్వానుభూతిని పెంపొందించుకొనే ఉద్దేశ్యము లేని వేదశబ్దోచ్చారణ నిష్ఫలము, దుఃఖభారము కూడా! ఈ దృశ్య జగత్ యొక్క ఉత్పత్తి - స్థితి లయములు ఎందులో చమత్కారంగా దృష్టికి అగుపిస్తున్నాయో- అట్టిదంతా ఆత్మతత్త్వస్వరూపుడనగు నా లీలావినోదావతారముగా గమనిస్తూ-ఈ జగత్తు నాయొక్క లీలగా,క్రీడగా స్తుతించే వాక్కే ప్రయోజనకరము. **ఈ దృశ్యమంతా పరమాత్మ యొక్క లీలా వినోదమే!** అని గమనించక, ఇక్కడి ప్రాప్తాప్రాప్తములకు - సుఖదుఃఖములకు సంబంధించిన మాటలనే చెప్పుకుంటూ పోతుంటే ఏమి లాభము? బుద్ధిమంతుడైనవాడు అటువంటి వాక్యాలు ఉచ్చరించడు! ఇంకొకరు మాట్లాడుతుంటే వినడు!. ఆహా! ఈ బంగారము ఎంత విలువైనది!.. అని గమనించేవానికి ఆభరణముయొక్క వంపుసొంపులు విషయమే కాదు కదా!

సర్వము బ్రహ్మమే! ఓ ఉద్ధవా! ఇక్కడ నీకు కనిపించే నానాత్వము (Multiplicity) అనే భ్రమను విడచిపెట్టు. ఇక్కడి భిన్నత్వంలోని ఏకత్వస్వరూపుడను- సర్వగతుడను అగు నన్నే ఆశ్రయించు. నీ మనోబుద్ధులను పరస్వరూపుడనగు నాకు సమర్పించు. నిర్మలమైన మనస్సుతో **అంతా పరమాత్మయొక్క ప్రదర్శనమే** యని గమనించటం ద్వారా మనస్సును నాకు సమర్పించు. "నా యొక్క దేహమనోబుద్ధి చిత్తాహంకారాలతోసహా ఈ సర్వము, ఈ సర్వ జీవులు పరమాత్మ స్వరూపమే"- అని గ్రహించి వర్తించు. సర్వకాల సర్వావస్థలయందు జిజ్ఞాసాపూర్వకంగా ఆత్మ ధ్యానం చేయి. నానాత్వ దర్శనం మొదలంట్ల విడనాడు!.

స్వార్థం - పరార్థం

- ఆచార్య కె. సర్వోత్తమరావు, (తిరుపతి)

స్వార్థం పరార్థం అనే రెండుమాటలు అందరికీ తెలిసినవే. ఈ రెండింటిలో పరార్థం వల్ల ఆవగింజంత నష్టం లేదు. కోరితే ప్రసాదించడం, కోరకపోయినా ప్రసాదించడం పరార్థంలో భాగాలు. ఒక్క విత్తనం నాటినా కృతజ్ఞతతో చిక్కుడుగింజ నేలను చీల్చుకుని పైకివస్తూ చేతులలాంటి రెండు ఆకులతో సూర్యునికి తన కృతజ్ఞతను చెప్పుకుంటుందని గుంటూరు శేషేంద్రశర్మ చాలా చక్కటి కవిత్వం రాశారు. సముద్రంలోని మేఘాలు అక్కడే కురియడం ఎందుకని భూభాగంపై కొన్ని వేళల మందగమనంతో మందహాసంతో కదలి వస్తుంటాయి. భూమిని సస్యశ్యామలం చేయడానికి ఆ మబ్బులు సహకరిస్తుంటాయి. పరార్థం ఎప్పుడు ప్రతిఫలాన్ని ఏమాత్రం ఆశించదు. కాని స్వార్థం అలాంటిది కాదు.

ఒకానొక దేశంలో ఒక వ్యక్తికి బంగారంపై మోజు ఎక్కువ. అతని మోజును పసిగట్టి దేవత ప్రత్యక్షమయింది. వరం కోరుకోమంటే పట్టిందల్లా బంగారం కావాలని కోరుకున్నాడు. సరే అంటూ దేవత అంతర్ధానమయింది. బంగారం మీద మోజుగల వ్యక్తి ఇంటిలోని ప్రతివస్తువును తాకుతుంటే బంగారం కావడం చూచి పరవశించిపోయాడు. చివరకు తన కూతురిని వాత్సల్యంతో దగ్గరకు తీసుకుంటే ఆమె కూడా బంగారు ప్రతిమ అయింది. అతడు ఒక్కసారిగా దిగాలు పడ్డాడు. చివరకు ఆకలితో అన్నపానాదులు దగ్గరికి వెళ్ళేసరికి అంతా కనకమయం కావడంతో భయాందోళన చెందాడు. చివరకు ఈ వరం వద్దు బాబోయ్ అని దేవత దగ్గర కాళ్ళబేరానికి వచ్చాడు. స్వర్ణకాంక్ష అతనికి ముప్పే తెచ్చింది.

ఇలాంటిదే మరొకటి. ఒక వ్యక్తికి పెద్ద భూస్వామి కావాలని కోరిక. ఒక దెయ్యం ఆ వ్యక్తితో సూర్యోదయ సమయానికి బయలుదేరి సూర్యాస్తమయం అయ్యేసరికి బయలుదేరిన ప్రదేశం చేరుకోవాలని అతడు తిరిగిన భూ ప్రదేశానికి తానే అధికారి అవుతాడని ప్రలోభపెట్టింది. అయాచితమైన ఈ వరానికి సామాన్యుడు ఉబ్బితబ్బిబైపోయాడు. ఆలాగే కర్ర చేతబట్టుకొని పొద్దుపొడిచేవేళ బయలుదేరాడు. అక్కడక్కడ గుర్తులు వేసుకుంటూ నడిచాడు. నడినెత్తిమీద సూర్యుడు మండుతుంటే ఇంకా చాలా పొద్దుందని వేగంతో ముందుకు పోసాగాడు. క్రమంగా ప్రొద్దువాలుతూ ఉంది. ఆ సామాన్యుడు సాయంకాలానికి బయలు దేరవలసిన స్థలంకేసి పరుగులెత్తడం మొదలుపెట్టాడు. శారీరకశ్రమను లెక్కపెట్టలేదు. చివరకు రొప్పుతూ, బయలుదేరిన ప్రదేశానికి వచ్చేసరికల్లా శోషతో క్రిందపడిపోయాడు. అతని ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. చివరకి అతనికి ఆరగుడుల పొడవు, మూడడుగుల వెడల్పు గుంతగల భూమి శరణ్యమయింది.

ఇలాగే పదవీవ్యామోహంతో రకరకాల దుండగాలను చేస్తుంటారు. చివరకు పలికేవాడు లేక ఏకాంత జీవితంలో మగ్గుతుంటారు. స్వార్థం ఇచ్చే ధైర్యం అతనిపై అవహించే పిశాచం లాంటిది. అన్ని రంగాలలోను పెచ్చు పెరిగిపోతున్న స్వార్థాన్ని మొక్కలోనే తుంచడం సర్వ శ్రేయస్కరం.

ఆధ్యాత్మికతయే భారతజాతికి జీవశక్తి. అది లేనప్పుడు ఎన్ని సాంఘిక సంస్కరణలు జరిగినప్పటికీ, కుబేరుని సమస్త ధనాన్ని గుమ్మరించినప్పటికీ భారతదేశానికి మనుగడలేదు. - స్వామి వివేకానంద



జీవుడా! మేలుకో!!

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

పరమసౌఖ్యమె నీవురోరన్నా
దుఃఖమెన్నడు, లేశమైనను నీకు లేదన్నా
మనసుచేతనె దుఃఖ మేర్పడు
మనసుదాటిన దుఃఖ మెచట?
మనసులేని ఆత్మయందున
ఎల్లవేళల స్థితిని బడయుము.
తత్త్వసారము తెలిసికోరన్నా
సద్గురునిచెంత, నిజము గనుగొని లాభమొందన్నా. 106

"నీవు ఎవరు?" అని ఎవరైనను అజ్ఞానిని ప్రశ్నించినచో వెంటనే అతడు "నేను ఫలానావాడను, నేను విద్యావంతుడను, నాజాతి ఇది, నా కుటుంబము ఇది,నా ఊరు ఇది" అని బదులిచ్చును. అతని ప్రత్యుత్తరమంతయు దేహమునకు, దృశ్యమునకు సంబంధిచినది, కాని అతని నిజస్వరూపమునకు చెందినది కాదు. జడమైన శరీరమే, చపలమైన మనస్సే తాను అని అవిద్యచే భ్రాంతినొందియున్న మనుజుడు దేహమనంబులకు కలుగు సుఖదఃఖములు తనకు సంభవించినట్లుగనే భావించి మిగుల అశాంతి నొందుచున్నాడు. మనస్సు వలననే రాగ ద్వేషములు. ఇష్టానిష్టములు జీవునకు అనుభూతమగును. అతనిని దుఃఖములు పాలుచేయుచున్న చంచలమగు మనస్సు వలననే జీవునకు దుఃఖపరంపరలు కలుగుచున్నవి. సమస్తద్వంద్వములను, మనస్సును దాటిపోయినచో దుఃఖము, బాధ సంభవించుటకు అవకాశమే లేదు.

ఆత్మయందు, దైవమందు స్థితిని బడసినవానికి పరమసౌఖ్యము సంప్రాప్తమగును. అమనస్కస్థితిని, బ్రహ్మజ్ఞానమును సంపాదించిన మనుజునకు దుఃఖరాహిత్యము, మహత్తరమైన ఆనందము కలుగుచున్నవి. పరమసౌఖ్యమే జీవుని వాస్తవస్వరూపము. ఆ స్వస్వరూపమును తెలుసుకొనుటకే మానవుడు జన్మించినది.

కావున ఓ జీవుడా! సంసారతృష్టా స్వప్నమునుండి, అజ్ఞానభ్రాంతి నుండి మేలుకో! నీవు దేహముకాదు, మనస్సు కాదు, బుద్ధి కాదు. వీటిన్నిటికి వేరై, పరమసుఖస్వరూపమైన చిదాత్మయే నీవు. సద్గురుదేవుని చెంత నీ నిజతత్త్వమును అనుభూతమొనర్చుకో! దైవసేవ, సద్గురుసేవ, సలుపు! భక్తి, వైరాగ్యము, వివేకము కలిగియుండు. చిత్తమును విశుద్ధసత్త్వగుణోపేతముగ ఒనర్చుకొని అమనస్కస్థితిని, మనస్సును దాటిన ఆత్మస్థితిని సంపాదించు. నిత్యానందపరాయణుడవై, ముక్తస్వరూపుడవై తేజరిల్లు. తరించు.

వేదాన్తభేరి పోషక చందా ఈ క్రింది వారు పంపినారు

1). ఎం.నాగేశ్వరగుప్త (హైద్రాబాద్) - రూ. 1500/-
2). మంతెన ప్రమోద్ (కిస్మత్, హైద్రాబాద్) - రూ. 1500/-
3). స్వర్గం మునీంద్రనాథ్(మాణిక్యమ్మతోట, కరీంనగర్) - రూ. 1500/-
4). జి.వెంకట్రెడ్డి (సరూర్‌నగర్, హైద్రాబాద్) - రూ. 1500/-

సద్గురు సర్వ సేవా ట్రస్టుకు ఈక్రిందివారు పైకం పంపినారు

1.పొట్టపర్తి నాగభూషణం (నందిపేట, నిజామాబాద్ జిల్లా))-రూ. 10,000/
(తల్లిదండ్రుల పేరిట అన్నదానానికి (ఇది వరలో ఇచ్చిన పోను వచ్చినది)

సంవత్సర చందాదారులకు విజ్ఞప్తి

మీ సంవత్సర చందా 2018 డిశంబరు నెలతో పూర్తయినది. అయినా మీకు జనవరి పత్రిక కూడా పంపినాము. కొందరు మాత్రమే తమ చందా పైకం నూరు రూ.లు పంపినారు. ఇంకను రెండువందలమంది పంపలేదు. కావున వెంటనే మీ చందా రూ. 100/-లను పంపి 2019 సం॥పు పత్రికను పొందండి. పత్రిక నిర్వహణలో మాకు తోడ్పండి. **పబ్లిషర్ - వేదాన్తభేరి**

శ్రీ మదాంధ్ర మహా భాగవతం

- ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

యజ్ఞాచరణ : "నారదా! ఆ దామోదరుడి బొడ్డు తామరనుంచే నేను పుట్టాను. నాకు యజ్ఞం చేయాలనిపించింది. అయితే దానికి కావలసిన పదార్థాలేవీ కనిపించలేదు. అప్పుడు చేసేది లేక ఆ భగవంతుడి రూపాన్నే మనస్సులో నిశ్చలంగా నిలుపుకొని ధ్యానం చేశాను. నాకొక ఉపాయం స్ఫురించింది. ఆ సర్వేశ్వరుడి అవయవాలనే యాగశాల, యూపస్తంభమూ, యజ్ఞపశువు మొదలైన యజ్ఞసంభారాలుగా భావించుకొని మానసిక యజ్ఞం చేశాను.

స్వాయంభువు మొదలైన మనువులూ, దేవతలూ, దానవులూ, రాజులూ, మనుష్యులూ వాళ్ళ వాళ్ళ కిష్టమైన దేవతలను కొలుస్తూ మహానిష్ఠతో ఇలాగే యజ్ఞాలు చేశారు. మహావిష్ణువుకే యజ్ఞఫలం సంక్రమించాలని భావించారు.

భగవంతుడు నిర్గుణుడైనప్పటికీ లోకాలను సృష్టించే ఉద్దేశంతో సగుణడౌతున్నాడు. ఆ భగవంతుడి సంకల్పం మేరకే ఈ ప్రపంచాన్ని నేను సృష్టిస్తున్నాను. ఆ విష్ణువే దీన్ని పోషిస్తున్నాడు. పరమశివుడు లయింపజేస్తున్నాడు. శ్రీహరి మొదటి వేల్పు. సృష్టి స్థితిలయాలకు హేతువులైన మూడు శక్తులతో కూడి ఉంటాడు. కుమారా! నువ్వడిగిన ప్రశ్నకు సరైన సమాధానమేమిటంటే సమస్త సృష్టికి ఆధారం ఆ పరబ్రహ్మమన్నదే. ఆ ప్రభువుకంటే శ్రేష్టుడు మరొకడు లేడు. నేను అబద్ధం చెప్పను. నిజమే చెబుతాను. నేను ఆ భగవంతుడి గుణాలను ఉత్సాహంతో ధ్యానిస్తాను. అందువల్ల నేను పలికేదంతా నిజమే అవుతుంది.

నా ఇంద్రియాలు ఏకారణంచేతగాని అసత్యంవైపుకు మొగ్గుచూపవు 'నాశరీరం వేదంతో సమానం. కాబట్టే ఇది దేవతలకు కూడా నమస్కరించదగి ఉంది. ఆ పరమాత్ముడి పాదాలు సంసార సముద్రాన్ని దాటిస్తాయి. శుభాలను చేకూరుస్తాయి. సమస్త సంపదలను సమకూరుస్తాయి. అటువంటి అచ్యుతుడి అంఘ్రియుగళానికి అనవరతమూ అభివందనం చేస్తాను.

నేను ఆ పద్మనాభుడి కుమారుడైనప్పటికీ, ప్రజాపతినైనప్పటికీ నాపుట్టుక గురించే తెలుసుకోలేక పోతున్నాను. అలాంటప్పుడు ఆయన ప్రభావం నాకు ఎలా బోధపడుతుంది. ప్రపంచం కొంచెంకొంచెంగా నాకు ఇప్పుడిప్పుడే గోచరిస్తూ ఉంది. ఆ సర్వేశ్వరుడు జగద్రక్షణ కోసం ధరించిన అవతారాలను, ఆయా అవతారాల్లో చేసిన పనులను మాలాంటి వాళ్ళం కొనియాడుతూనే ఉంటాం. ఎంత ప్రయత్నించినా ఆ దేవుణ్ణి మనం తెలుసుకోగలమా? ఆ దేవదేవుడికి నేను నమస్కరిస్తాను.

ఆ ఆదిపురుషుడికి వేయితలలు, వేయినేత్రాలు, వేయిపాదాలు. ప్రకృతిని ప్రవర్తింపజేసే రూపమది. ఇది ఆ దేవదేవుడి మొదటి అవతారమని చెప్పవచ్చు. దీన్నుంచి కాలమూ, స్వభావమూ అనే రెండు శక్తులు పుట్టాయి. అందులోనుంచి కార్యకారణ రూపమైన ప్రకృతి పుట్టింది. దానినుండి రాజసాహంకారం. సాత్త్వికాహంకారం, తామసాహంకారం అనే మూడహంకారాలు పుట్టాయి. వాటిలో రాజసాహంకారం నుండి ఇంద్రియాలు పుట్టాయి. సాత్త్వికాహంకారం నుండి ఇంద్రియగుణాలు ప్రధానంగా గల ఇంద్రాది దేవతలు పుట్టారు. తామసాహంకారంనుండి పంచభూతాలకు హేతువులైన శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం అనే తన్మాత్రలు పుట్టాయి. ఆ తన్మాత్రల నుండి ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి అనే పంచభూతాలు ప్రభవించాయి, వాటి నుండి

త్వక్కు, చక్షువు, శ్రోత్రం, జిహ్వ, ఘ్రాణం అనే జ్ఞానేంద్రియాలూ, మనస్సు పుట్టాయి. వీటన్నిటి చేరిక వల్ల విశ్వస్వరూపుడైన విరాట్పురుషుడు ఉదయించాడు. అతని నుండి స్వయంప్రకాశుడైన స్వరాట్టు ఆవిర్భవించాడు. అతనిలో నుంచి చరాచర రూపాలతో స్థావర జంగమాత్మకం అయిన జగత్తు పుట్టింది. దాని నుంచి సత్త్వగుణ స్వరూపుడైన విష్ణువూ, రజోగుణ స్వరూపుడైన నేనూ, తమోగుణ స్వరూపుడైన రుద్రుడూ జన్మించాము. దక్షుడూ మొదలైన తొమ్మిదిమంది ప్రజాపతులు పుట్టారు. వారి నుండి నీవూ, సనకుడు, సనందుడు మొదలైన యోగీశ్వరులు, స్వర్గలోకంలో ఉండే ఇంద్రాదులు, పక్షిలోక రక్షకులైన గరుడాదులు, మానవలోకాన్ని పాలించే మనువు, మాంధాత మొదలైన వారూ, తల లోకాన్ని పాలించే అనంతుడు, సిద్ధులూ, విద్యాధరులూ, చారణులూ, సాధ్యులూ, రాక్షసులూ, యక్షులూ, ఉరగులూ, నాగులూ, ఆ జాతులను పాలించే వారు, ఋషులు, పితృదేవతలు, దైత్యులు, దానవులు, భూతాలు, పిశాచాలు, కూష్మాండులు, పశు మృగాదులు ఉద్భవించాయి. ఇలాంటి జగత్తు మొదటి పుట్టుకను మహత్తత్త్వసృష్టి అంటారు. రెండవది అండగతమైన సృష్టి. మూడవది సమస్త భూతగతమైన సృష్టి. అందులో ఐశ్వర్యమూ, తేజస్సూ, బలమూ గల పురుషులు సర్వాంతర్యామి అయిన శ్రీమన్నారాయణుడి అంశలో పుట్టినవారని గ్రహించు. ఆ అరవిందాక్షుడి లీలావతారాలకు అంతంలేదు. ఆయన ఆచరించే మంచి పనులు లెక్కించడం ఎవరికీ శక్యంగాదు. అయినా నాకు తోచినంతవరకు నీకు వినిపిస్తాను విను".

ఏకాగ్రతతో చేసే మానిసికయజ్ఞంగాని, మానసిక పూజగాని అనంతఫలదాలని బ్రహ్మమాటలను బట్టి ప్రస్ఫుటమౌతుంది. శ్రేష్ఠుడుగా పరిగణింపబడేవాడు చేసే పనులను తక్కినవాళ్ళు కూడా అనుసరిస్తారని మన్వాదుల యజ్ఞాచరణ బోధపరుస్తుంది. సత్యవాది దేవతలకు కూడా

వందనీయుడని విధాత మాటలు విదితం చేస్తాయి. విష్ణువే విరాట్ స్వరూపుడని, పరబ్రహ్మమని వెల్లడౌతుంది. విష్ణుదేవుడి అవతారాలూ, లీలలూ తెలుసుకొనేందుకు సాధ్యపడేవి కావని బ్రహ్మమాటలను బట్టి తేటపడుతుంది.

శ్రీమన్నారాయణ లీలావతారాలు : "నారదా! వీనులకు విందుగా విష్ణుకథలను వినిపిస్తాను విను.

1.యజ్ఞ వరాహావతారం : పూర్వం హిరణ్యాక్షుడనే రాక్షసుడు ఉండేవాడు. వాడు మహా బలాఢ్యుడు. వాడీ భూమినంతా చాపలాగా చుట్టి తనతో తీసుకవెళ్ళి సముద్రగర్భంలో దాక్కున్నాడు. అప్పుడు శ్రీమన్నారాయణుడు యజ్ఞవరాహరూపం ధరించాడు. సముద్రగర్భంలోకి వెళ్ళి ఆ రాక్షసుడితో భయంకరంగా యుద్ధం చేశాడు. తన కోరలతో క్రుమ్మి వాడిని కడతేర్చాడు.

2. సుయజ్ఞావతారం : రుచి అనే ప్రజాపతికి ఆకూతి అనబడే అతని అర్ధాంగికి 'సుయజ్ఞుడు' అనే పేరుతో శ్రీహరి జన్మించాడు. 'దక్షిణ' అనే వనితను భార్యగా స్వీకరించాడు. ఆమె కడుపున సుయములనబడే దేవతలను జన్మింపజేశాడు. ఇంద్రుడై దేవతలకు నాయకత్వం వహించాడు.

3. కపిలావతారం : దేవహూతికి, కర్దమ ప్రజాపతికి తొమ్మిదిమంది కుమార్తెలు జన్మించారు. వారి తరువాత 'కపిలుడు' అనే పేరుతో శ్రీహరి జన్మించాడు. మోక్షహేతువైన సాంఖ్యయోగాన్ని తల్లికి బోధించాడు. మోక్షాన్ని ఆమెకు ప్రసాదించాడు.

4. దత్తాత్రేయావతారం : అత్రి మహర్షి సంతానం కోసం శ్రీమన్నారాయణ్ణి ప్రార్థించాడు. విష్ణువు ప్రత్యక్షమయ్యాడు. నేను నీకు దత్తుడనయ్యాను అన్నాడు. అనసూయ అత్రి దంపతులకు కుమారుడుగా జన్మించాడు. దత్తాత్రేయుడుగా ప్రసిద్ధి కెక్కాడు. ఆయన అనుగ్రహం వల్ల హైహయ

యదు వంశాలవారు జ్ఞానఫలాన్నీ, సుఖాన్నీ, ఐశ్వర్యాన్ని, శక్తినీ, శౌర్యాన్నీ పొందారు.

5. సనకాదుల అవతారం : కల్పారంభంలో నేను సృష్టి చేయాలనుకున్నాను. దానికోసం తపస్సు ప్రారంభించాను. 'సన' అన్నాను. సన అని ప్రారంభమయ్యే పేర్లు గల నలుగురు కుమారులు జన్మించారు. వారంతా విష్ణుదేవుడి అంశతోనే జన్మించారు. ఇది కూడా విష్ణుదేవుడి అవతారాల్లో ఒకటే. వారే సనకుడు, సనందుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు. బ్రహ్మ మానసపుత్రులుగా వీరు ప్రసిద్ధులయ్యారు. గత కల్పంతో మరుగున పడిపోయిన ఆత్మతత్త్వాన్ని సంప్రదాయాలనుసారంగా లోకంలో వీరు వ్యాపింపజేశారు.

10వ భాగవత సదస్సు

శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో 10వ భాగవత సదస్సు 15-3-2019వ తేది నుండి 21-3-2019 తేది వరకు ఏడు రోజులు జరుగును. ఇందు శ్రీమాన్ శ్రీనివాస రామానుజదాసు గారు (కాళీవనాశ్రమము -నంబూరు) దశమస్కంధంపైన ప్రవచన చేస్తారు.

గృహవైద్యం

1. నిమ్మరసం, కొబ్బరినూనె సమపాళ్లలో కలిపి 2 చుక్కలు చెవిలో వేస్తే చెవిపోటు తగ్గిపోవును.

2. ఆవు నెయ్యిని అరికాళ్ళకు మర్దన చేసినచో కంటి జబ్బులు తగ్గిపోవును.

3. తెల్ల జీలకర్ర 20 గ్రాములు నీళ్లతో నూరి రోజు రెండు పూటలా త్రాగుచుండినచో రేచీకటి, కంటిలో పుండ్లు తగ్గిపోవును.

- (డా॥ ధన్వంతి, బి.ఎ. ఎం.ఎస్- ఆరోగ్య సుధ నుండి)

" మహాశివరాత్రి - పట్టిసీమ వీరన్న "

- డా ॥ కె.బి. రాజేంద్రప్రసాద్, ఎం.ఎ., పిహెచ్.డి.,

ఆధ్యాత్మికనీతిని, భక్తిరసస్ఫూర్తిని, మహాశైవాచారవిభూతిని, శివతత్త్వ రీతిని, పరమాత్మ మహావైభవ దీప్తిని ప్రపంచానికి, ప్రకృతి జీవులకును ఆవిష్కరించిన పర్వదినాలలో ప్రముఖమైన పర్వదినం మహాశివరాత్రి. శివము అంటేనే శుభము, మంగళప్రదము అని అర్థం. శక్తి అమృతాలతో కూడిన శాశ్వతానంద కారకుడు శివుడనియును కొందరు సెలవిస్తున్నారు. సత్యం, శివం, సుందరమయమైన సర్వేశ్వరరూపం శివుడు. వేదపురాణ శాస్త్ర సాహిత్యం ఏ దైవాన్ని ఈశ్వరుడని, సర్వలోక మహేశ్వరుడని సెలవిస్తుందో ఆ దైవం జ్యోతిర్లింగ రూపంలో దర్శనమిచ్చి, సత్య సనాతన పరబ్రహ్మతత్త్వాన్ని ప్రతిపాదించిన పావనదినం మహాశివరాత్రి. అదే మాఘ కృష్ణ చతుర్దశి. ఈ రోజున ఆరుద్ర నక్షత్రయుక్తుడై చంద్రుడుంటాడు. ఆరుద్ర నక్షత్రం స్వామిలోకాలకు సాక్షాత్కరించిన రోజు. శివపార్వతులకు వివాహమైన రోజుకూడా యిదే.

ఈ మహాశివరాత్రి పర్వదినంలో శివక్షేత్రాలే కాకుండా శైవమత శక్తులు నెలకొన్న క్షేత్రాలలోను శైవాచార విభూతితో ఉత్సవాలు నిర్వహించుకోవడం, తద్వారా సామాజిక జనచైతన్యాన్ని, భక్తజన భక్తి వైభవాన్ని, భక్త్యాచార నిరతి అందలి స్వచ్ఛతలను ప్రదర్శించడం విశేషం. మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించుకొనే శైవక్షేత్రాలలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కొలువున్న దేవాలయాలను ప్రముఖంగా చెప్పుకోవాలి. అందున్న వీరభద్రమూర్తి ఆవిర్భావమే శివధర్మాన్ని, శైవాచారాన్ని, శివభక్తి ఔన్నత్యాన్ని నిల్పడానికి, చాటడానికి ఉద్దేశించబడింది. వీరభద్రునే వీరన్న, వీరేశ్వరుడు, భద్రుడు అనియూ అంటారు. వాడుకలో వీరన్నయే ఈరన్నగా

మారినాడు. వీరభద్రుని దివ్యక్షేత్రాలలో పట్టిసీమ ఒక్కటి. పట్టిసీమ వీరభద్రుని గురించి తెల్సుకొందాం.

ఆంధ్రరాష్ట్రంలో గోదావరి జిల్లాలో, పావనగౌతమీ తటమునగల దేవకూట పర్వతం మీద వీరభద్రుడు భద్రకాళీ సమేతుడై కొలువున్నాడు. అక్కడే శ్రీభూనీలా సమేత భావనారాయణస్వామియు, మహిషాసురమర్దిని యైన జగన్మాతయును కొలువై యుండడం విశేషం. అయితే ఈ దేవకూటం ప్రస్తుతం నది మధ్యలో ఉంది. అయినా భక్తుల దర్శనానికి, పూజలకును ఎలాంటి యిబ్బంది లేని ఏర్పాట్లు ఉండడం గమనార్హం.

దక్షునకు అల్లుడు శివుడు. సతీదేవి దక్షుని కుమార్తె. గతంలో ఒక మారు శివుడు మామయైన తనను గౌరవించలేదని మత్సరించిన దక్షుడు, శివరహితమైన యాగమారంభించాడు. సర్వదేవగణాలను ఆహ్వానించాడు. కాని కుమార్తె సతిని కాని, అల్లుడు శివుని గాని ఆహ్వానించలేదు. అయినా సతీదేవి తండ్రియాగమంటపానికి వెళ్ళింది. పిలువని పేరంటానికి వచ్చిన సతీమాతను దక్షుడు ఘోరంగా అవమానించాడు. శివనిందను చేసాడు. తనముందే తన తండ్రి తన భర్తను నీచంగా నిందించడాన్ని సతీమాత భరించలేక, తండ్రి కారణంగా వచ్చిన తన తనువును యోగాగ్ని కల్పించుకొని దహించుకొంది. సతీదేవి మరణ వార్త విన్న శివుడు ఆగ్రహోదగ్రుడై ప్రళయాగ్ని సన్నిభాకారుడైన వీరభద్రుని సృష్టించి, 'దక్షయాగాన్ని, ధ్వంసం చేసి, ఆయాగానికి వచ్చిన వారిని శిక్షించి, దక్షుని సంహరించు'మని ఆజ్ఞాపిస్తాడు. వీరభద్రుడును దక్షయాగాన్ని, ధ్వంసం చేశాడు. దివిజులను తగురీతిలో శిక్షించాడు. దక్షుని శిరస్సును "పట్టిసం" అనే పొడవైన కొడవలి వంటి కత్తితో ఖండిస్తాడు. అనంతరం ఆ దేవకూట పర్వతంపై వీరావేశంలో నాట్యం చేస్తాడు. అనంతరం దేవగణాల ప్రార్థనపై శివుడు దక్షుని మేకతలతో బ్రతికిస్తాడు.

తాను దక్షిణామూర్తిగా ఒక మర్రిచెట్టు పాదులో మౌన ముద్రలోకి వెళ్తాడు.

అయితే వీరభద్రుని రౌద్రం తగ్గలేదు. విష్ణుమూర్తి నృసింహావతారంలో వీరభద్రుని శాంతింప విఫలుడైనాడు. తన సుదర్శన చక్రాన్ని వీరునిపై ప్రయోగిస్తాడు. వీరభద్రుడు ఆ చక్రాన్ని కరకర నమిలి మ్రింగేస్తాడు. కాని శాంతించలేదు. చివరకు అగస్త్యమహాముని ప్రయత్నంతో వీరుడు శాంతించి తాను వీరేశ్వరలింగంగా ఆవిర్భవించాడు.

అనంతరం విష్ణువు నిత్యం వీరభద్రుని సహస్రకమలములతో పూజించే వ్రతం చేపట్టాడు. కాని ప్రతిసారి ఆయనకు ఒక కమలం తక్కువ అవుతోంది. చివరకు ఒకరోజు చేసేదిలేక తన నేత్రకమలమునే వీరన్న దగ్గరుంచాడట. అప్పుడు వీరభద్రుడు ప్రసన్నుడై, తాను నమిలి మ్రింగిన సుదర్శన చక్రంతోపాటు, స్వామికి నేత్రాన్ని అనుగ్రహించాడని ప్రతీతి. నాటినుండి వీరభద్రుని కన్నడంలో "కన్నడిగ" అంటారు. కన్నుపాదములవద్ద కలవాడని అర్థం. ఆ శ్రీహరే భావనారాయణస్వామిగ ప్రసిద్ధిడైనాడు. అయితే పట్టిసమనే ఆయుధంతో దక్షుని శిరస్సును బింగించి, ఆ పట్టిసమనే ఆయుధాన్ని గోదావరీ నదీ జలాలలో స్వామి కడిగాడట. కనుక ఈ ప్రాంతం పట్టిసీమ, పట్టిసం, పట్టిసనిధి అనే పేర్లతో వెలిసాయి.

ఇక భద్రకాళీమాత పుట్టుక. వీరభద్రుని వీర నాట్యంలో త్రిశూలం క్రిందికి తాకి భద్రకాళీ మాత ఆవిర్భవించింది. నిజానికి జగన్మాత పార్వతీమాత పదునారవ కళ భద్రకాళీమాత. పుట్టినప్పుడు నల్లగా భయంకరంగా ఉన్ననూ, పావన జలాలలో స్నానం చేసి, పదునారు సంవత్సరాలపడుచ్చునై, తన అపురూప సౌందర్యలహరీ విన్యాసంతో భద్రుని అలరించడంతో స్వామి పూర్తి శాంతస్వరూపం పొందాడట. అందుకే మహర్షులు భద్రకాళీ భద్రేశ్వరులకు శాంతి కల్యాణం జరిపించారట. నాటి నుండి స్వామికి శాంతి కల్యాణం శుభప్రదం, శోభన ప్రదంగా

పెద్దలు సెలవిచ్చారు.

మహాశివరాత్రి సందర్భంగా పట్టిసీమలో ఐదురోజులు ఉత్సవాలను నిర్వహిస్తారు. వీరేశ్వరలింగానికి నమకచమకాలతో అభిషేకాలు,అర్చనలు నిర్వహిస్తారు. శ్రీశైలం, కాశి, కేదారం, శ్రీకాళహస్తి, పట్టిసీమలను పంచాకాశీ లంటారు.

నిజానికి వీరభద్రుడు అపరరుద్రుడే, శివ అష్టోత్తరంలో "ఓం వీరభద్రాయనమః" అని కూడా ఉంది. పోతనమహాకవి "వీరభద్ర విజయం" అన్న పేరుతో ఒక కావ్యాన్ని రచించాడు. అందుస్వామిని శివభక్తులకు చల్లని సంపూర్ణ చంద్రుడని,శరణార్థులకు వజ్రపంజరంలా రక్షణ కల్పించే వాడని, శివద్రోహులకు ప్రళయకాలాగ్నియని, రౌద్రంలో ఆగ్రహోదగ్రుడైన రుద్రమూర్తియని, దేవలోక గర్వ సంహారియని, భక్తులకు మాత్రం కరుణాసముద్రుడై శుభాలందిస్తాడని చెప్పడం జరిగింది.

నాగేంద్ర చిహ్నితమైన గజచర్మధారియని, పటిష్ఠమైన పదినూరు చేతులు గలవాడని, కాంతివంతమైన కోరలున్నవాడని, కోరమీసాలవాడని, నిప్పులొలుకు చూపులవాడని, సూర్యకాంతులు విరజిమ్ము మణికిరీటమువాడని, మంటలెగసే నుదుటి కన్నువాడని, బ్రహ్మాండాలతో బంతులాడగలవాడని, గండరగండడని, స్ఫురద్రూపియని స్వామి ఆకృతిని వర్ణించడం జరిగింది. రుద్రాంశ సంభూతుడైన వీరభద్రుని రౌద్రమూర్తిని గాంచిన శ్రుతులు

"నిఖిల తంత్రములకు నీలకంఠుడు వేల్పు భువినగ్ర దైవంబు పూజచేయ

పరమోపదేశంబు పరమంబు పరమాత్మ శివుడౌటయెఱుగరే సృష్టినసుచు"

అని ఈశ్వర తత్త్వాన్ని చాటాయి. బ్రహ్మాది దేవతలు వీరన్నను "వేదంబులున్నీవ వాదంబులున్నీవ ధైర్యంబులున్నీవ యాబ్రహ్మయున్నీవ

యీ విష్ణువున్నీవ యీ రుద్రుడున్నీవ సర్వంబునున్నీవ... మన్నింపవే దేవ శ్రీవీరభద్ర శరణ్యంబురుద్రా" అంటూ వేడుకొన్నారు.

ఈ మొత్తం పరిశీలించగా వీరభద్రమూర్తి సాక్షాత్తు ఆ పరమేశ్వరతత్త్వమే. సర్వేశ్వరుని కాదని నిర్లక్ష్యం చేసిన వారిని శిక్షించే మహారుద్రశక్తి వీరభద్రుడు. అంతేకాదు గ్రహదోషాలతో బాధపడేవారిని, సంతుసౌభాగ్యహీనులై దిగులుపడేవారిని, పురాకృత కర్మలు వ్యాధి రూపంలో కబళించగా దుఃఖపడేవారిని, అధైర్యం, అలజడి, ఆందోళనలనే మానసిక రుగ్మతలతో వేదనపడే వారిని కాచి రక్షించగల ఒక దివ్యశక్తి వీరభద్రమూర్తి. జనహృదయాల ధైర్యశక్తి, కర్తవ్యకర్మల నిర్వహణాస్ఫూర్తి అలాంటి దేవతామూర్తిని శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పూజిద్దాం. ఉపాసిద్దాం. గండాలనుండి గట్టెక్కించే స్వామికి "గండాదీపాలు" వెల్గించడం, కోరికలను తీర్చే దేవునికి "గుగ్గిలసేవ" చేయడం, మన సంకల్పం నెరవేరినప్పుడు "పళ్ళెర సేవలో"మొక్కులు చెల్లించుకోవడం, వీరభద్రఖడ్గాలనే గేయాలను పాడుతూ ఆడుతూ అగ్ని గుండంలో నడచడం, మహానైవేద్య సమర్పణం మొదలగు అనేక సంప్రదాయాలను వీరభద్రుని సంబరాలలో చూస్తాం. అలాగే ప్రభలు కట్టి వీరన్న, ప్రభువుని దర్శించి, మోదాన్ని పొందడం గమనిస్తాం. మహాశివరాత్రిని ఒక సామాజిక చైతన్యస్ఫూర్తికి నిదర్శనంగా మనం భావించవచ్చు.

కం॥ రక్షింపుము కరుణాకర
రక్షింపుము లోకనాథ రమ్యాకారా
రక్షింపుము రిపుసంహార
రక్షింపుము వీరభద్ర రౌద్రసముద్రా !

Statement of Ownership and other Particulars of Vedantha Bheri (FORM IV See Rule 8)

01. Place of Publication	:	Srikalahasti
02. Periodicity of its Publications	:	Monthly
03. Printer's Name	:	B.Viswa Natha Raju
Whether Citizen of India ?	:	Yes
Address	:	C.N.PRINTERS, Prakasam Road, TIRUPATI
04. Publisher's Name	:	Vidyaswarupanandagiri Swamy
Whether Citizen of India ?	:	Yes
Address	:	Sri Sukabrahma Asramam, Swami Vidyaprakasananda Nagar, Sri Sukabrahma Ashram (P.O.) SRIKALAHASTI - 517640
05. Editors Name	:	Vidyaswarupanandagiri Swamy
Whether Citizen of India ?	:	Yes
Address	:	Sri Sukabrahma Asramam, Swami Vidyaprakasananda Nagar, Sri Sukabrahma Ashram (P.O.) SRIKALAHASTI - 517640
06. Name and Address of Indiduals Who own the News Paper Partners of Share holders holding more than one percent of the total Capital	:	Vidyaswarupanandagiri Swamy, Sri Sukabrahma Ashram Spiritual Institution Srikalahasti - 517640 Chittoor District A.P.

I Vidyaswarupanandagiri Swamy hereby declare that the particulars give above are true to the best of my knowledge and belief.

Date : 2nd March 2019 **(Sd/-) Vidya Swarupanandagiri Swamy**
Signature of the Publisher

వార్తలు

(01). 27-1-2019వ తేది సద్గురు సర్వ సేవాట్రస్టుబోర్డు సమావేశం శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరిగినది.

(02). 27-1-2019వ తేది ఆదివారం శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి స్మారక గ్రామీణవైద్యశిబిరం ఏర్పేడు మండలం కోబాక గ్రామంలో జరిగినది. తొమ్మిదిమంది సుప్రసిద్ధ స్పెషలిస్టు డాక్టర్లు అందు పాల్గొని గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసి తగు చికిత్సలు చేశారు. సద్గురు సర్వసేవా ట్రస్టు ఉచితంగా మందుల వితరణ చేసినది.

(03). కృష్ణాజిల్లా పెనమలూరు (విజయవాడ సమీపం)లోని శ్రీ పరమాత్మా నందాశ్రమంలో ఆశ్రమాధ్యక్షులు పూజ్యశ్రీ శంకరానందగిరి స్వాములవారు (శ్రీ జ్ఞాన సరస్వతీ పీఠాధిపతులు) ఫిబ్రవరి 10,11,12 వతేదీల్లో వారి ఆశ్రమంలో నిర్వహించిన విశ్వశాన్తి మహాయాగంలో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొని 10వ తేది తమ ఆధ్యాత్మిక ప్రవచన చేశారు.

(04).శ్రీ శుకబ్రహ్మాశమంవారి తొమ్మిదవ భాగవత సదస్సు 13-2-2019వ తేది ప్రారంభమై 19-2-2019 తేదితో పూర్తి అయినది. పూజ్యశ్రీ మాతాజ్యోతిర్మయానంద భారతి స్వామిని వారు తమ భాగవత ప్రవచన ద్వారా శ్రోతలను ఆనందపరచినారు.

(05). హైద్రాబాద్-మల్కాజిగిరిలోని శ్రీమాణయ్యగారి సత్సంగ సమాజం వారు నిర్వహించిన సనాతన వేదాన్త బ్రహ్మజ్ఞాన సభలలో చివరిరోజు 21వ తేది పూజ్య శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొని ప్రవచన చేశారు.

(06).ఆశ్రమంలో త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు నిర్వహించుచున్న భక్త కన్నప్ప కంటి ఆసుపత్రిలో 2018 సంవత్సరంలో ఓ.పి. విభాగంలో 11278 మందికి కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేయబడినవి. 962 మందికి కంటి పొరలు తొలగించి కళ్ళలో లెన్సు అమర్చబడినవి. 89 మందికి యాగ్‌లేజర్ చికిత్సలు చేయబడినవి. 12 గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహింపబడినవి.720 మందికి ఉచితంగా కళ్ళద్దాలు ఇవ్వబడినవి.

(7). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో జనవరి నెలలో ఓ.పి విభాగంలో **393** మందికి కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేయబడినవి. **32** మందికి కంటి పొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడినవి. **4** గ్రామీణ వైద్య శిబిరాలు జరుపబడినవి.